ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 1 అక్టోబరు 2025



రక్తదాతలూ వందనం


- ఆపదలో ఉన్న వారికి ఎంతో సాయం
- జీవితంలో 168 సార్లు దానం చేయవచ్చు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

4లో





తోటపల్లి ప్రాజెక్టు



‘ పార్వతీపురం మన్యం వ్యవసాయాధారిత జిల్లా. సాగుతో పాటు అనుబంధ రంగాలు అభివృద్ధి చెందితేనే ఫలితం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వీటిని పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి రాగానే.. ప్రభుత్వం వీటిపై దృష్టి సారించింది. కొన్నింటిని ప్రాధాన్యతగా గుర్తించి నిధులు కూడా కేటాయిం చింది. అయితే ఈ పనులను త్వరగా పూర్తిచేసి ప్రయోజనం కలిగించాలని రైతులు కోరుతున్నారు. నేడు విజయనగరం జిల్లా దత్తికి సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో మన్యంలో పరిస్థితిపై కథనం.. ’

వేగం పెంచాలి

- జిల్లాలో అస్తవ్యస్తంగా సాగునీటి ప్రాజెక్టులు
- ఐదేళ్లు తీవ్ర నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం
- త్వరగా పూర్తిచేయాలని మన్యం వాసుల వేడుకోలు
- ఇతర సమస్యలపైనా స్పందించాలని విన్నపం
- నేడు విజయనగరం జిల్లాకు సీఎం రాక

ప్రధాన సమస్యలివీ..

పార్వతీపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జంఝావతి ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాల్సి ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి. జైకా నిధులతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. వీఆర్ఎస్, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, పెదంకలాం ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తే రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయి. పార్వతీపురం, మక్కువ మండలాల్లో అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేయాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు అత్యంత కీలకమైనది. 19,85,221 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలన్న లక్ష్యంతో తొలుత దీనికి రూ.1127.58 కోట్లతో పాలనా అనుమతి లభించింది. ఇప్పటివరకు రూ.900 కోట్లు వరకు వెచ్చించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఏటా ఖరీఫ్‌లో 80 వేల ఎకరాలకు కూడా నీరు అందడం గగనంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బడ్జెట్ కేటాయింపు రూ.655.19 కోట్లు చేసినా.. విడుదల చేసింది మాత్రం రూ.61.82 కోట్లే. అప్పట్లో ఏడాదికి రూ.100 కోట్లు ఇచ్చినా ప్రధాన పనులు పూర్తయ్యేవని అధికారులు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వం చివరకు కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్ల బిల్లులు కూడా పెండింగ్ పెట్టింది. చంద్ర బాబు సీఎం అయ్యాక వీటిని చెల్లించారు. ఆ తర్వాత పనులు కూడా ప్రారంభం అయ్యాయి. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

● జిల్లా కేంద్రం పార్వతీపురం, సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. సాలూరు, భద్రగిరి తదితర ఆసుపత్రుల నిర్మాణాలను కూడా పూర్తిచేస్తే రోగులకు

(మిగతా 6వ పేజీలో...)



దత్తి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రులు, అధికారులు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విజయనగరం, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధ వారం విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పేదలకు పింఛన్లను పంపిణీ చేస్తారు. అనంతరం వారితో ముఖాముఖిలో పాల్గొంటారు. టీడీపీ శ్రేణులతోనూ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆయన పర్యటన ఏర్పాట్లను మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లు మంగళవారం పరిశీలించారు. సీఎం పర్యటనకు సంబంధించిన మ్యాప్‌ను కూడా మంత్రులు పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఇతర అధికారులతో కలిసి చర్చించారు.

మక్కువలో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం

6లో



కన్నంపేట రహదారిపై వరద నీరు

కోటదుర్గమ్మ సన్నిధిలో కలెక్టర్

6లో

వృద్ధుడిపై హత్యాయత్నం

5లో

నేడు బొబ్బిలి కోటలో ఆయుధపూజ



5లో

యథావిధిగానే పింఛన్ల పంపిణీ

- దివ్యాంగులందరికీ అందజేత
- మార్పులు లేవని అధికారుల వెల్లడి



గరుగుబిల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎటువంటి మార్పులు లేవు. యథావిధిగానే లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్ము అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 7,500 దివ్యాంగ పింఛన్లను గతంలో పునఃపరిశీలించారు. అయితే వైకల్య శాతం తక్కువగా ఉన్నవారికి పింఛన్లు నిలుపుదల చేయనున్నట్లు గత నెలలో ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా పింఛన్‌దారులు ఆందోళన చెందారు. అయితే ఆగస్టులో దివ్యాంగులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందించింది. కాగా ఈ నెలలో పింఛన్లు ఇస్తారో లేదోనని కొంత మంది టెన్షన్ పడ్డారు. అయితే యథావిధిగా దివ్యాంగులందరికీ పింఛన్ల సొమ్ము అందించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 1,40,401 మంది పింఛన్‌దారులకు రూ.50.91 కోట్లను విడుదల చేసింది. మండలాల్లో సచివాలయ సిబ్బందికి ఆ మొత్తాలను జమ చేశారు. బుధవారం వారు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించనున్నారు. దీనిపై డీఆర్ డీఏ పీడీ సుధారాణి మాట్లాడుతూ.. ‘జిల్లాలో పింఛన్‌దారులకు అసౌకర్యం కలగకుండా పింఛన్లు పంపిణీ చేపట్టనున్నాం. ఎటు వంటి మార్పులు లేవు. దివ్యాంగులందరికీ పింఛన్ సొమ్ము అందిస్తాం. నూతన పింఛన్లు మంజూరు కాలేదు.’ అని తెలిపారు.

దుర్గాదేవీ నమోస్తుతే

- వైభవంగా దుర్గాష్టమి పూజలు
- పాలకొండలో సంబరాల సందడి



దుర్గమ్మ అవతారంలో కోటదుర్గమ్మ

పాలకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గమ్మ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, పుష్పాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమపూజలు చేశారు. మరోవైపు సామూహిక సంబరాలు సందర్భంగా శక్తి వేషాలు, ఘటాలతో పాలకొండ పట్టణం హోరెత్తింది. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణంలో కొందరు కోళ్లు, పసుపు, కుంకుమ చూపించి మొక్కులు చెల్లించారు. మరోవైపు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈవో సూర్యనారాయణ, ఆలయ సిబ్బంది, పోలీసులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



పాలకొండ ప్రధాన రహదారి గుండా ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తజనం

నామినేటెడ్ పద్ధతికి స్వస్తి

- ఉపాధిలో కొత్త నిబంధనలు
- అభివృద్ధి పనులకు ఇకపై టెండర్లు

పార్వతీపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కొత్త నిబంధనలు అమలులోకి రానున్నాయి. దీనిపై సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. ఇకపై ఉపాధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహించనున్నారు. నామినేటెడ్ పద్ధతికి స్వస్తి చెప్పనున్నారు. మెటీరియల్ కాంపోనెంట్‌తో చేపట్టే ఏ పనినైనా ఇకపై టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను ఖరారు చేస్తారు. కాగా గతంలో మెటీరి యల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను నామి నేటెడ్ పద్ధతిలోనే కేటాయించేవారు. సర్పంచ్ ఉన్నప్పటికీ అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు లేదా ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలోనే ఈ పనులు జరిగేవి. అయితే తాజాగా నిబంధనలు మారడంతో ప్రస్తుత కూటమి శ్రేణులు, ద్వితీయ శ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఇకపై వారు టెండర్ విధానంలో పాల్గొని అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. దీనిపై డ్వామా పీడీ రామచంద్రరావును వివరణ కోరగా.. ఇకపై నిబంధనల మేరకు టెండర్లు నిర్వహించి ఉపాధి అభివృద్ధి పనులు కేటాయిస్తామని తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు

- ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి బబిత

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత తెలిపారు. రాజ్యాంగంలో వారికి ప్రత్యేక హక్కులు కల్పించినట్లు చెప్పారు. మంగళవారం చినమరికి గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల సాధికారిత, సమానత్వం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు, ప్రణాళికలు అమలు చేస్తున్నా యన్నారు. వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమ న్నారు. అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు మాట్లాడుతూ.. గిరిజనులకు ఆధారమైన భూమి, అడవులను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు కల్పించిన హక్కులు తోడ్పడతాయని తెలిపారు.

సత్ప్రవర్తనతో శిక్షణను పూర్తి చేయండి

బెలగాం: సత్ప్రవర్తనతో మెలిగి ఖైదీలు శిక్షణను పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత సూచించారు. మంగళవారం పార్వతీపురం సబ్ జైలులో వసతులను పరిశీలించారు. ఆహారం, వైద్య సౌకర్యాలు, ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం నాణ్యమైన ఆహారం అందుతుందా? లేదా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. జైలులో రికార్డులను పరిశీలించిన అనంతరం ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌పై వివరించారు. అడ్వకేట్, పారా లీగల్ వాలంటీర్ ఖైదీలకు అవసరమైన న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు.



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయాధికారి

పైడిమాంబకు ఘటాభిషేకం



ఘటాలతో పైడితల్లి ఆలయానికి వెళ్తున్న భక్తులు

విజయనగరం రూరల్/కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబకు మంగళవారం భక్తులు ఘటాభిషేకం చేశారు. పసుపు, కుంకుమ, వివిధ సుగంధద్రవ్యాలతో కలిపిన నీటిని బిందె/మట్టి కుండలో (ఘటాలు) ఉంచి తమ, తమ ప్రాంతాల నుంచి బయలుదేరి ముర్రాటలు సమర్పించారు. జొన్నగుడ్డి, లంకాపట్టణం, హుకుంపేట, శాంతినగర్, ఇప్పిలి వీధి, సంతపేట గొల్లవీధి, గవరవీధి, బుర్లెపేట, కొత్త గవరవీధి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా వచ్చారు. దీంతో నగరంలోని ఎటూ చూసినా భక్త జన సందోహమే కనిపించింది. ఊరేగింపులో విచిత్ర వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పైడిమాంబ సిరిమానోత్సవానికి వారం రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు.

వైద్యసేవలకు ఆటంకం కలగకుండా..

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యామ్నాయ చర్యలు
- పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

పార్వతీపురం/ జియ్యమ్మవలస, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ కోటా, ఇతర డిమాండ్ల సాధన కోసం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. గత నెల 26వ నుంచి వారు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం పార్వతీపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీలు నిర్వహించ నున్నారు. 3న విజయవాడలో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నారు. అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలకు ఆటంకం కలగ కుండా జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. వాస్త వంగా జిల్లాలో ఉన్న 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 74 మంది వైద్యాధికారులు విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం వైద్యాధికారుల పోరు బాట పట్టడంతో వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో భాస్కరరావు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త జి.నాగభూషణ రావుతో చర్చించి.. 20 మంది వైద్యాధికారులు, ఆయుష్ నుంచి 14 మంది, మరో 8 మంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపించారు. ఆసుపత్రుల్లో 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సులకు సెలవులను రద్దు చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి పర్యవేక్షణకు ఓ టీము ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో అత్యవసర కేసులు మినహా మిగిలిన రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.



కంట్రోల్ రూములో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చెరువులకు రక్షణ

- ఆక్రమణలకు గురికాకుండా చర్యలు
- టేకు మొక్కల పెంపకానికి ప్రణాళికలు

పార్వతీపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువుల రక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సరిహద్దులు నిర్ణయించి.. వాటి చుట్టూ టేకు మొక్కల పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే సంబంధిత అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో చెరువుల లెక్కను సైతం తేల్చారు. మొత్తంగా 450 పంచాయతీల్లో 1843 చెరువులకు బౌండరీలు నిర్ణయించి వాటి చుట్టూ టేకు మొక్కలు పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి అంచనాలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే 409

(మిగతా 6వ పేజీలో...)



అధికారులు గుర్తించినవి..

మండలం	పంచాయతీ	చెరువులు
సాలూరు	29	219
బలిజిపేట	24	132
సీతంపేట	53	35
సీతానగరం	35	124
వీరఘట్టం	34	64
గుమ్మలక్ష్మీపురం	27	12
గరుగుబిల్లి	25	169
భామిని	26	198
జియ్యమ్మవలస	31	51
కొమరాడ	32	147
కురుపాం	23	38
పాచిపెంట	28	178
మక్కువ	21	201
పాలకొండ	32	59
పార్వతీపురం	30	216

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

● పరిశీలించిన మంత్రులు, అధికారులు

దత్తిరాజేరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటన ఏర్పాట్లను పలువురు మంత్రులు మంగళవారం పరిశీలించారు. దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో సీఎం చంద్రబాబునాయుడు బుధవారం పర్యటించను న్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌లు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసీ ఎస్.సేతుమాధవన్‌తో కలిసి సీఎం పాల్గొనే వేదికలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివిధ సూచనలు చేశారు. వారితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ రోజంతా దత్తి గ్రామంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సీఎం పర్యటన ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటి కప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ప్రతి నెలా ఒక జిల్లాలో పర్యటిస్తున్నారని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సీఎం సభావేదిక వద్ద ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేయడానికి సీఎం ప్రతీనెలా ఏదో ఒక జిల్లాకు వెళుతూ... అక్కడి ప్రజలతో మమేకమై... వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని చెప్పారు. పాలనాపరంగా నిర్ణయాలను తీసుకునేందుకు ఈ పర్యటనలు దోహదం చేస్తున్నాయని తెలిపారు. సీఎం హోదాలో మొదటిసారిగా తమ నియోజకవర్గానికి వస్తున్నందుకు, మారుమూల గ్రామ మైన దత్తిని తమ పర్యటనకు ఎంపిక చేసుకున్నందుకు సీఎంకు మంత్రి కొండపల్లి కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పని చేయండి..

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి సమీక్షించారు. ఆయన దత్తి గ్రామంలోని అన్ని వేదికలను స్వయంగా పరిశీలించారు. గ్రామ సచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసీ సేతుమాధవన్, ఇతర ఉన్నతాధికారులతో చర్చించి సూచనలు చేశారు. ఎవరికి అప్పగించిన విధులను వారు పకడ్బందీగా నిర్వర్తించి పరస్పరం సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే బేబీనాయన, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయానికి భక్తుల తాకిడి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవానికి సమయం ఆసన్నమవుతోంది. మరోవైపు దసరా పండుగ సందడి మొదలైంది. దీంతో విజయనగరం, పరిసర ప్రాంతాల ప్రజలు పైడిమాంబ దర్శనానికి పోటెత్తుతున్నారు. మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం పైడిమాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఎక్కువ మంది భక్తులు దర్శించుకున్నారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడిలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు పైడిమాంబ ఆలయానికి రావడం మొదలైంది. 6.45 గంటలకు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా వేగంగా దర్శనం పూర్తయ్యే విధంగా దేవదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అదే విధంగా పైడిమాంబను వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందజేశారు.


అమ్మవారి సన్నిధిలో భక్తులు


పైడితల్లి అమ్మవారు

హోం మంత్రి అనితకు ఆహ్వానం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనితకు పైడిమాంబ సిరిమానోత్సవ పండుగ ఆహ్వానాన్ని ఆలయ ఇన్‌చార్జి ఈవో కె.శిరీష మంగళవారం అందించారు. ఈ నెల 6న తోలేళ్లు, 7న సిరిమానోత్సవానికి విజయనగరం రావాలని, పైడిమాంబను దర్శించుకోవాలని హోంమంత్రి అనితను ఈవో శిరీష కోరారు.


← హోం మంత్రి అనితకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో శిరీష

రక్తదాతలూ వందనం

- ఆపదలో ఉన్న వారికి ఎంతో సాయం
- జీవితంలో 168 సార్లు దానం చేయవచ్చు
- జిల్లాలో స్వచ్ఛందంగా ముందుకొస్తున్న యువత
- ప్రజల్లో మరింత అవగాహన అవసరం
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

- బొబ్బిలికి చెందిన ఉపాధ్యాయుడు విజయమోహనరావు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవా లన్న లక్ష్యంతో రక్తదానం చేయడానికి ముందుకొచ్చే వారు. ఆయన ఏకంగా 90 సార్లు రక్తదానం చేయడంతో అందరి అభినందనలు అందుకుంటున్నారు.
- నెల్లిమర్ల మండలం జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షుడు పాలుబోతు దుర్గాప్రసాద్ 63 సార్లు రక్తదానం చేశారు. అదే సంఘంలో సభ్యుడైన మద్దిల రాంబాబు 35 సార్లు, రొంగల దుర్గాప్రసాద్ 14సార్లు రక్తదానం చేశారు.
- జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంచి చైతన్యకుమార్ 32 సార్లు రక్తదానం చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు.
- రాజాంకు చెందిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కేవీఎస్ ప్రసాద్ ఇప్పటివరకూ 35సార్లు రక్తదానం చేశారు.
- రాజాంకు చెందిన ఆటోడ్రైవర్ కోటి ఏకంగా 42 సార్లు రక్తదానం చేశారు. ఆపదలో అవసరం అనుకుంటే చాలు.. రక్తదానానికి ముందుంటారు.

రాజాం/రాజాం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి)

..ఇలా స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న వారి సంఖ్య పెరుగుతుండం ఆనందించదగ్గ విషయం. కానీ ఇంకా అవసరానికి తగ్గట్టు రక్తం సేకరించలేక పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో అత్యవసర, అనారోగ్య సమయాల్లో వందల యూనిట్ల రక్తం అవసరం. కానీ పదుల సంఖ్యలోనే రక్తదాతలు ముందుకొచ్చి అందిస్తున్నారు. జిల్లాలో తొమ్మిది రక్తనిల్వ కేంద్రాలు ఉండగా..అందులో రెండు మాత్రమే ప్రభుత్వానివి. మిగతావి ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు. రెడ్‌క్రాస్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా రక్తదానం చేసేందుకు ప్రజలు ముందుకు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఎవరు చేయాలంటే?

18 సంవత్సరాలు నిండిన వారు రక్తదానం చేయవచ్చు. 18 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే.. జీవిత కాలంలో దాదాపుగా 168 సార్లు రక్తదానం చేయవచ్చునని నిపుణులు చెబుతున్నారు. బరువు 45 కిలోలు పైబడిన వారు, బీపీ అదుపులో ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. తీవ్రమైన వ్యాధులు, మూర్ఛ, మూత్ర పిండాల వ్యాధిగ్రస్తులు, అలర్జీ ఉన్నవారు, అసాధారణ రక్తప్రసరణ లక్షణాలు, త్వరితగతిన బరువు కోల్పోవడం, హృదయ సంబంధ వ్యాధిగ్రస్థులు, ఇతర ప్రమాదకరమైన వ్యాధులు లేనివారు రక్తదానం చేయవచ్చు. మన జిల్లాకు సంబంధించి రెడ్‌క్రాస్‌తో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థల ద్వారా రక్తదానం చేయవచ్చు. రక్తదాన శిబిరాలు నిర్వహించవచ్చు.


రక్తదానం చేస్తున్న రాము


రక్తదానం చేస్తున్న యువత

56సార్లు రక్తదానం చేశా..

నాది ఓ పాజిటివ్ గ్రూపు రక్తం. ఇప్పటి వరకూ 56సార్లు రక్తదానం చేశాను. మా అక్కకు శస్త్రచికిత్స సందర్భంగా తొలిసారి భయపడుతూనే రక్తదానం చేశాను. అప్పటి నుంచి ఏడాదికి మూడు నుంచి నాలుగుసార్లు రక్తదానం చేస్తున్నాను. రాష్ట్ర గవర్నర్ సంతకం చేసిన సర్టిఫికెట్ పొందడం నాజీవితంలో మరచిపోలేనిది. ఎక్కడ, ఎవరికి రక్తం కావాల్సి వచ్చినా నా సొంత ఖర్చులతో అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తున్నాను.

-శనపతి రాము, రక్తదాత, పొగిరి

విస్తృత అవగాహన..

జిల్లాలో అవసరానికి తగ్గట్టు రక్త సేకరణ జరగడం లేదు. రక్తదానం విషయంలో రెడ్‌క్రాస్ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. అవగాహన ఉన్నవారు మాత్రమే దానం చేస్తు న్నారు. కొత్తవారు రావడం లేదు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు పోవాలి. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు కృషిచేయాలి.

-ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, విజయనగరం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హాలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



మడ్డువలసకు జల కళ

వంగర, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మడ్డువలస ఎగువ ప్రాంతం ఒడిశాలో విస్తారంగా వర్షాలు కురవటంతో వేగావతి, సువర్ణముఖి నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు రెండు గేట్లు తెరిచి నాగావళికి నీరు విడుదల చేశారు. మంగళవారం ఉదయం వరకు 64.39 మీటర్లు ఉన్న నీటి మట్టం ఒక్కసారిగా 64.60కు పెరిగింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 64.50 మీటర్లుగా స్థిరీకరించగా నదుల్లో ప్రవాహం రావటంతో ప్రమాద సూచక దాటింది. దీంతో అధికారులు రెండు గేట్లు నుంచి 7,572 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నదుల్లో 6,912 క్యూసెక్కులు వచ్చినప్పటికీ అదనంగా నీరు కిందికి విడుదల చేస్తున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు.

నేటి నుంచి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు బంద్

భోగాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పీహెచ్‌సీల్లో అక్టోబరు 1వ తేదీ నుంచి వైద్య సేవలు నిలిచిపోనున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబరు 26వ తేదీ నుంచి పీహెచ్‌సీల్లో పలు రకాల సేవలు నిలిపివేస్తూ వైద్యులు నిరసన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అక్టోబరు 1వ తేదీ నుంచి అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిచిపోనున్నాయి.

● విజయనగరం జిల్లాలో ఈనెల 7న పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఉండడంతో జిల్లా పీహెచ్‌సీ వైద్యులు వైద్య సేవలపై తర్జన బర్జన పడు తున్నారు. అలాగే ఈనెల 3, 4 తేదీల్లో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

● దీనిపై జిల్లా వైద్యాధికారిణి జీవనరాణిని వివరణ కోరగా.. పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలుపుదలకు సంబంధించి ఇంతవరకు తనకు ఎవరు కూడా వినతిపత్రాలు గానీ, సమ్మె నోటీసు గానీ ఇవ్వలేదని తెలిపారు.

టీడీపీలోకి చేరిక

విజయనగరం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుప్పాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కరుమజ్జి వెంకట రమణ, బోర గణేష్, పాండ్రంకి అప్పలనాయుడు, నడుపూరు త్రినాథ్‌తో పాటు 30కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో వీరంతా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఇది పేదల ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

భోగాపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం పోలిపల్లి గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. పూసపాటిరేగ మండలం కనిమెట్టకు చెందిన ఆరిశెట్టి రామారావుకు రూ.90,178, భోగాపురం మండలం గుడివాడ గ్రామానికి చెందిన మద్ది సింహాచలంకు రూ.50,227, నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపేటకు చెందిన బుగత రమేష్‌కు రూ.20వేలు విలువ గల చెక్కులను అందజేశారు. కనిమెట్ట, గుడివాడ సర్పంచ్‌లు కె.గోవిందరావు, చిల్ల జమున పాల్గొన్నారు.

నిలదీసే వారిపై అక్రమ కేసులు

చీపురుపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలపై ప్రశ్నించిన వైసీపీ కార్యకర్తలు, నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని జడ్పీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆరోపించారు. చీపురుపల్లిలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు రోడ్లపై క్యూ కట్టి నానా యాతన పడుతుంటే, సంబంధిత మంత్రి మాత్రం యూరియాకు ఎటువంటి కొరత లేదని ప్రకటిస్తున్నారన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తున్న వైసీపీ సోషల్ మీడియా విభాగంపై కేసులు పెడుతున్నారన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

గంట్యాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామం పరిధిలో గల శ్మశానవాటికలో పేరుకుపోయిన జంగిల్‌ను యువత స్వచ్ఛందంగా మంగళవారం తొలగింపజేశారు. యువకులు సొంతంగా నిధులు సమకూర్చుకుని ప్రొక్లయినర్‌తో జంగిల్ తొలిగించారు. ఇక్కడ వెళ్లే రహదారి కూడా జంగిల్‌తో కప్పివేయడంతో దీనిని కూడా తొలగించారు.

మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

గంట్యాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఎస్సీ దామోదర్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. తన గ్రామానికి చెందిన బి.పరశురామ్ అనే వ్యక్తి గత మూడేళ్లుగా తనను ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని కోరింది.

జై దుర్గాభవానీ

● ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
● విశేష అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు
● ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో విశేష అలంకరణలో దర్శనమిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కొత్తవలస: విశేష అలంకరణలో దుర్గమ్మ



చీపురుపల్లి: దుర్గాదేవి అవతారంలో కనకమహాలక్ష్మి



రాజాం: అంతికాపల్లిలో దుర్గాదేవిగా విశాలాక్షి



ఎస్.కోట: దుర్గాదేవి అవతారంలో శ్రీదేవిమాత



భోగాపురం: గుడివాడలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



వంగర: రుషింగిలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోండ్రు



విజయనగరం బాబామెట్ట: శంకరమఠంలో దుర్గాదేవికి పూజలు



వేపాడ: పాటూరులో ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం



జామి: అట్టాడలో దుర్గమ్మకు సమర్పించిన సారె

మెరుగైన సేవలు అందిస్తున్నాం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్బర్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని బీఎస్ఎన్ఎల్ డీజీఎం డి.దాలినాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత 25 ఏళ్లుగా విజయనగరం ఆపరేషన్ ఏరియాలో 300 టవర్లు విజయవంతంగా ప్రారంభించామని చెప్పారు. 2.45 లక్షల వినియోగదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. 45 ఫోర్ జీ చాసులేషన్స్ మొబైల్ టవర్లు ప్రారంభించామని చెప్పారు. ఏజీఎం శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మురళీధర్, శారద, ప్రమోద్‌కుమార్‌దాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ లక్ష్యాలు తుంగలోకి

కొత్తవలస, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వస్తున్న పాలకులు ఆ రాజ్యాంగ లక్ష్యాలను తుంగలోకి తొక్కుతున్నారని యూపీఎస్సీ పూర్వ సభ్యుడు, ద్రావిడ యూనివర్శిటీ పూర్వ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కేఎస్ చలం అన్నారు. సత్యశోధక్ సమాజ్ స్థాపించి 152 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర దళిత విముక్తి ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ నేతృత్వంలో మంగళవారం కొత్తవలసలో మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు వీఎస్ కృష్ణ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షలు



రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులు 103వ రోజు నిరసనలో భాగంగా మంగళవారం బొడ్డవరలో రిలే దీక్షలు చేశారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ చట్ట ప్రకారం నిర్వాసితులకు వారి భూములు అప్పగించాలని కోరారు.

అనుమతి లేకుండా విగ్రహం నిర్మిస్తున్నారు

గంట్యాడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలో అనుమతి లేకుండా గాంధీ విగ్రహాన్ని నిర్మిస్తున్నారంటూ గ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్‌లకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం గాంధీ విగ్రహం ఉన్నా, దీని పక్కనే మరో విగ్రహాన్ని అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని, దీనిపై విచారణ చేయాలని కోరారు.

నేడు బొబ్బిలి కోటలో ఆయుధ పూజ

బొబ్బిలి సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి కోటలో ఏటా విజయదశమికి ముందురోజు చేపట్టే ఆయుధ పూజకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంప్రదాయ సిద్ధంగా బుధవారం ఆయుధ పూజ చేపట్టనున్నారు. రాజవంశీయులైన మాజీమంత్రి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు, ఎమ్మెల్యే బేబీనాయన, వారి సోదరుడు రామకృష్ణరంగారావు, ఇతర కుటుంబసభ్యులు కోటలో వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, రాజసింహాసనాలను ప్రత్యేకంగా అలంకరించి దర్బారుమహల్‌లో ఈ పూజలు చేయనున్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే అభినందన



డీఎస్సీ ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో విజయం సాధించిన విజయనగరం నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యాయులను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు. ఒక్కొక్కరితో మాట్లాడి వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగులకు అన్యాయమే జరిగిందన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా మెగా డీఎస్సీని నిర్వహించి, కూటమి ప్రభుత్వం ప్రశంసలు అందుకుందన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక బకాయిలు చెల్లించాలంటూ ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జడ్పీ మినిస్టీరియల్ భవనంలో ఏపీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు బలరాంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు సుమారు 30 వేల కోట్లు ఉన్నాయని, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే డీఏ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు 7న ఫ్యాప్టో రాష్ట్ర స్థాయి సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంఘ నాయకులు సదాశివరావు, డి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న సమస్యలపై ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న 'చలో విజయవాడ' కార్యక్రమానికి జిల్లా నుంచి ఉపాధ్యాయులు హాజరు కావాలని రాష్ట్ర ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరంలోని కార్యాలయంలో ఫ్యాప్టో చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షతన యూటీఎఫ్ కార్యాలయంలో కరపత్రాన్ని విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించాలని సీపీఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం ఆర్థిక బకాయిల చెల్లింపు వంటి సమస్యలు నేటికీ 16 నెలలు పూర్తయినా పూర్తి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు ఈశ్వరరావు, పైడిరాజు, జోగారావు, రామారావు, మోహనరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలను అడ్డుకోవడం బాధాకరం

శృంగవరపుకోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ సభల నిర్వహణ పంచాయతీ పాలకవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కు.. వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నించడం బాధాకరమని పలువురు సర్పంచ్‌లు అన్నారు. మంగళవారం శృంగవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీకి చెందిన గదిలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశమయ్యారు. గ్రామ సభ ఏర్పాటుకు పూనుకున్న పేదఖండేపల్లి సర్పంచ్ యాళ్ల రమణను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లడంతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే కూర్చోబెట్టడాన్ని తప్పుపట్టారు. పాలక మండలి నిర్ణయం మేరకు గ్రామ సభ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నానని సర్పంచ్ రమణ తెలిపారు. తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం అవమానకరం గా ఉందన్నారు. తామంతా అండగా ఉంటామని మిగిలిన ప్రజాప్రతినిధులు ఆయనకు మాట ఇచ్చారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, మండల పరిధిలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నగరానికి నవశోభ

● పైడిమాంబ జాతర నేపథ్యంలో జోరుగా సాగుతున్న సుందరీకరణ పనులు



ఎత్తు బ్రిడ్జి నుంచి విశాఖకు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ ఇలా..

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతర పుణ్యమంటూ నగరానికి కొత్త శోభ సంతరించుకుంది. అసంపూర్తిగా, అధ్వానంగా ఉన్న రహదారులను బాగుచేశారు. మరో మూడు నాలుగు రోజుల్లో కొన్ని ప్రధాన కూడళ్లు, రెండు మార్గాల సుందరీకరణ పనులు కూడా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఎత్తు బ్రిడ్జి వద్ద విశాఖపట్టణం వెళ్లే మార్గాన్ని విస్తరించి ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టారు. ట్యాంకుబండ్ రోడ్డులో పొలం వైపు రోడ్డుని నిన్నటి వరకూ అసంపూర్తిగానే వదిలేశారు. దీంతో ఫుట్‌పాత్ కూడా వినియోగించే పరిస్థితి లేకపోయింది. ప్రస్తుతం ఆ రెండు పనులను పూర్తి చేస్తున్నారు. అలాగే మయూరి కూడలి నుంచి రైల్వే స్టేషన్ వెళ్లే రోడ్డును పూర్తి స్థాయిలో బాగు చేశారు. బాలాజీ మార్కెట్ నుంచి కలెక్టరేట్‌కి వెళ్లే రోడ్డును కొన్నేళ్లుగా కొంత భాగం అసంపూర్తిగా వదిలేయడంతో వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటువంటి పరిస్థితి లేకుండా ప్రస్తుతం ఆ రోడ్డుని తాత్కాలికంగా చక్కదిద్దారు. గుమ్చీ నుంచి అయ్యన్నకోనేరు వెళ్లే రహదారి కూడా కొంత పాడైంది. దానికి కూడా మరమ్మతులు చేపట్టారు. దాసన్నపేట, ఎర్రచెరువు వద్ద ఉన్న రోడ్డు మట్టి ఇరువైపులా పేరుకుపోయి వర్షం పడితే, ఆ మార్గం చెరువులా మారేది, రెండు రోజుల కిందట ఆ మార్గంలో రెండు వైపులా మట్టిని తొలగించి వర్షం నీరు వెళ్లడానికి ఏర్పాట్లు చేసి ఆ ప్రాంతంలో సుందరీకరణ పనులు కూడా చేపడుతున్నారు. కాంప్లెక్స్ నుంచి బాలాజీ వైపు వచ్చే ట్యాంకు వైపు వచ్చే రోడ్డు వర్షం పడితే, జలాశయంగా మారేది. ఆ మార్గంలో కూడా కొంత భాగాన్ని చెరువు గట్టు పక్కన పూడ్చేసి నీరు వెళ్లడానికి కాలువ నిర్మించారు. అంబేడ్కర్ కూడలి వద్ద సుందరీకరణ పనులు నిర్వహించారు. వీటితో పాటు డివైడర్‌కి ఇరువైపులా కొత్తగా రంగులువేశారు. కొన్నిచోట్ల రైలింగు పాడైతే, వెల్డింగ్ చేసి మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు కూడా రెండు మూడు రోజుల్లో పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇక వీధి దీపాల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలను మార్పుచేసి, కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.



రైలింగ్‌కు రంగులు ఇలా..



రాజీవ్ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు

తండ్రి చూస్తుండగానే..

● రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



ద్రాక్షాయని (ఫైల్)



గాయపడిన కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్తున్న తండ్రి

రాజాం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు కావడంతో ఇంటి నుంచి తల్లిదండ్రులతో సరదాగా ద్విచక్ర వాహనంపై బొద్దాం వెళ్లిన ఆ చిన్నారికి అదే ఆఖరి ప్రయాణమైంది. బొద్దాంలో పని ముగించుకుని రాజాం మీదుగా బూరాడ వెళ్లాల్సిన ఆ కుటుంబం రాజాంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. తల్లిదండ్రులిద్దరూ చిన్నగా యాలతో బయటపడగా ఆర్టీసీ బస్సు వెనుక చక్రాలు పైనుంచి వెళ్లడంతో చిన్నారి కొద్దిక్షణాల్లోనే ప్రాణాలు విడిచింది. చివరి నిమిషంలో కుమార్తెను కాపాడుకోవాలని తండ్రి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన ద్రాక్షాయని (6) విషాదాంతమిది. రాజాం పట్టణంలో మంగళవారం మధ్యాహ్నాం ఈ ప్రమాదం జరిగింది. ఏఎస్ఐ రమణమూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన మోహన రావు, భార్య ఇందు, కుమార్తె ద్రాక్షాయని (6) కలిసి రాజాం మండలం బొద్దాం గ్రామానికి ద్విచక్ర వాహనంపై మంగళవారం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా రాజాం మెయిన్‌రోడ్‌లో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. మోహనరావు, ఇందు చిన్నపాటి గాయాలకు గురి కాగా ద్రాక్షాయని దొర్లుకుంటూ ఆర్టీసీ బస్సు వెనుక చక్రానికి తగిలి తీవ్ర గాయాలపాలైంది. ఘటనా స్థలానికి ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి బాలికను తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో జీఎంఆర్ నగర్‌లోని కేర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ద్రాక్షాయని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రమణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ద్రాక్షాయణి రాజాంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో యుకేజీ చదువుతుండేది. మోహనరావు రాజాంలో బైక్ మెకానిక్.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతానగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురానికి చెందిన ఎస్.సతీష్(25) అనే యువకుడు పురుగు మందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సతీష్ గత కొంత కాలంగా ఓ అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి పెళ్లి చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో సతీష్ మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సతీష్ ఆర్టీసీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు.

సరైన ఉద్యోగం రాలేదని..



ప్రదీప్(ఫైల్)

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తూరు గ్రామానికి చెందిన గోకేడ ప్రదీప్(25) తనకు సరైన ఉద్యోగం రాలేదన్న మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాపునాయుడు కుమారుడు ప్రదీప్ హైదరాబాద్‌లోని ఒక నెట్‌వర్క్ సంస్థలో పనిచేస్తున్నాడు. అయితే ఇది తనకు తగిన ఉద్యోగం కాదని నిత్యం వాపోయేవాడు. రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చిన ప్రదీప్ మనోవేదనతో ఉన్నాడు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

రామభద్రపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బూసాయవలస జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వెలమల ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండకెంగువ గ్రామానికి చెందిన రాజుమహేంద్ర అప్పలమ్మ (65) మెంటాడ నుంచి మామిడివలస గ్రామానికి వెళుతుండగా బూసాయవలస జంక్షన్‌లో కారు ఢీకొందన్నారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో చేర్పారన్నారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతిచెందిందని తెలిపారు. మృతురాలి మనవడు ఆర్.ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వృద్ధుడిపై హత్యాయత్నం

జియ్యమ్మవలస, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బిత్రపాడు గ్రామానికి చెందిన బోను రామ్మూర్తినాయుడు (73)పై అదే గ్రామానికి చెందిన వరుసకు మేనల్లుడైన అల్లు వెంకటకృష్ణారావు సోమవారం సాయంత్రం హత్యాయత్నానికి పాల్పడినట్టు చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. మంగళవారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. ఏడాదిన్నర కిందట పక్క పక్క ఇళ్లు నిర్మించుకున్న సమయంలో మెటీరియల్ పడితే కృష్ణారావును రామ్మూర్తినాయుడు నిలదీశాడన్నారు. అప్పటి నుంచి ఎప్పుడైనా చంపేస్తానని కృష్ణారావు హెచ్చరించేవాడని రామ్మూర్తినాయుడు తెలిపారన్నారు. తుదకు సోమవారం సాయంత్రం కత్తితో దాడి చేశాడని చెప్పారు. బాధితుడు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి నిందితుడి చేతిలో నుంచి కత్తి తీసుకున్నారన్నారు. అప్పటికే రామ్మూర్తినాయుడుకు కుడి చెవిపై కుడి చేతిపై గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు.

సీఎస్‌డీటీ తీరు అభ్యంతరకరం

జామి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎస్‌డీటీ మూర్తి తీరు అభ్యంతరకరంగా ఉందని రామయ్యపాలెం గ్రామానికి చెందిన సంపత్ మహిళ మండలి సభ్యులు అన్నారు. మంగళవారం వీరు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మాట్లాడారు. ఇక్కడ ఉన్న డీలర్ అక్రమాలకు పాల్పడడంతో తమ సంఘానికి సీఎస్‌డీటీ మూర్తి గత నెల డిపోను అప్పగించారన్నారు. అయితే రెండో నెల సరుకులు ప్రభుత్వం తమ మహిళ మండలి పేరుపై పంపిస్తే.. గ్రామానికి చెందిన డీలర్ వర్గీయులు, వైసీపీ నాయకులు తమపై దౌర్జన్యం చేసి, సరుకులు దింపడానికి వీలు లేదని గొడవ పడ్డారన్నారు. దీంతో సరుకులు తీసుకొచ్చిన లారీ వెనక్కి వెళ్లిపోయిందన్నారు. దీనిపై సీఎస్‌డీటీని అడిగితే వైసీపీ తరఫున మాట్లాడటం దారుణమన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

● దీనిపై సీఎస్‌డీటీ మూర్తిని వివరణ కోరగా.. ఈ వివాదంపై పాత డీలర్ హైకోర్టును ఆశ్రయించారని, వారికి అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినట్టు చెప్పారని తెలిపారు. అయితే ఈ విషయాన్ని పూర్తి స్థాయిలో ఆర్డీవో వద్ద తీసుకువెళ్లి, ఆ తర్వాత సరుకులు ఇద్దామనుకుని ఆపానని చెప్పారు. ఈ విషయంలో తాను ఎవరికీ మద్దతుగా నిలవలేదని స్పష్టంచేశారు.

వ్యాపారులపై కేసులు




తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పట్టణంలో తూనికల్లో మోసం చేస్తున్న పండ్ల బళ్ల వ్యాపారులపై తూనికలు, కొలతల శాఖ అధికా రులు కేసులు నమోదు చేశారు. బళ్లపై వివిధ రకాల పండ్లు విక్రయిస్తు న్న వ్యాపారులు తక్కువ తూకవ వేసి ఇస్తున్నారని స్థానికులు జిల్లా తూనికలు, కొలతల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఉమాసుందరీ దాడులు నిర్వహించారు. పండ్లు విక్రయిస్తున్న బళ్ల వద్ద కాటాల ను పరిశీలించారు. వినియోగారులకు విక్రయిస్తున్న పండ్ల తూకవను పరిశీలిం చారు. తూకవ తక్కువ రావడం స్వయంగా చూశారు. తూకవ రాళ్లు కూడా సక్రమంగా లేనట్లు గుర్తించారు. 2019లో వేయించిన సీళ్లు ఉన్నాయి. దీంతో తనిఖీలు నిర్వహించిన ఐదు పండ్ల బళ్ల యజమానులపైన కేసులు నమోదు చేశారు. కాటాలను సీజ్ చేశారు. కార్యాలయానికి రావాలని ఆదేశించారు.

ఆటోలో నుంచి జారిపడిన వ్యక్తికి గాయాలు

గంట్యాడ సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి జారి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గంట్యాడ మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గంట్యాడ గ్రామానికి చెందిన చిన్నయ్య అనే వ్యక్తి విజయనగరం నుంచి ఆటోలో గంట్యాడకు వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రంగా గాయమైంది. వెంటనే స్థానికుల సహాయంతో 108 వాహనంపై పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి పూజలు



సాలూరు:మహాకాళీ అవతారంలో..



పార్వతీపురం పట్టణంలో..



భామిని: చిట్టిగాజులతో అర్చన

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమ్మవార్ల ఆలయాలతో పాటు పూజా మండపాల్లో మంగళవారం దుర్గాష్టమిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బైపాస్ కాలనీలో ఏర్పాటైన పూజా మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులు పి. సత్యనారాయణ, కె.ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేపట్టారు. అలాగే పట్టణ శివారులోని సూర్యపీఠంలో దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో దుర్గాదేవికి శ్రీచక్రార్చన చేశారు.

●సాలూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు మహాకాళీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీ హోమం చేపట్టారు. పట్టణంలోని కారు స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన పూజా మండపాన్ని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంతి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ●భామిని: పల్లెల్లో దసరా సందడి నెలకొంది. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా సొలికిరి, ఘనసర, చిన్నదిమిలి, కొరమ తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే బత్తిలిలోని లలితాత్రిపుర సుందరి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి లక్ష చిట్టిగాజులతో అర్చన చేశారు. ●వీరఘట్టం: స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో మంగళవారం దుర్గాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ●మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోలమాంబ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ●పాలకొండ: పట్టణంలోని నక్కలపేటలోని షిర్డీసాయిబాబా ఆలయంలో లలితా మహాత్రిపుర సుందరీదేవి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కోటదుర్గమ్మ సన్నిధిలో కలెక్టర్



కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకుడు, ఈవో

పాలకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులను ఈవో వి.వి.సూర్యనారాయణ, ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు.. కలెక్టర్ దంపతులకు కోట దుర్గమ్మ చరిత్రను వివరించారు. ఆలయ ప్రాంగణంలో సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని కలెక్టర్‌కు ఈవో అందజేశారు. కార్యక్రమంలో సీఐ ప్రసాదరావు, అర్చకులు మణీలశర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.

వేగం పెంచాలి

(3వ పేజీ తరువాయి)

మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. ఇక పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు.

● మన్యం వాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించాలి. తక్షణమే ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాల్సి ఉంది.

● జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, అదే విధంగా అత్యధిక శాఖలకు సంబంధించి సొంత భవనాలు లేవు. పూర్తిస్థాయిలో అధికారులు కూడా లేరు. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.

● పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాల్సి ఉంది.

● కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది.

● జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే గిరిజనులతో పాటు ఎంతోమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికంగా ఉపాధి పొందే అవకాశం ఉంది.

● మన్యంలో పది మందికి ఉపాధి చూపించే ఒక్క చిన్న పరిశ్రమ కూడా లేదు. ఈ నేపథ్యంలో జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

● గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి. మరిన్ని సేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉంది.

● ఆశ్రమ పాఠశాలల్లో పిల్లల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఏఎన్ఎంలను నియమించాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలో అంతర్రాష్ట్ర, జిల్లా రహదారులు గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దారుణంగా తయారయ్యాయి. ఐదేళ్లలో కనీస నిర్వహణ లేక అధ్వానంగా మారింది. దీన్ని పీపీపీ పద్ధతిలో పూర్తిచేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. చిలకపాలెం-రాజాం-జైపూర్ రోడ్డు.. అలికాం-పార్వతీపురం- రాయగడ రోడ్ల నిర్మాణంతోనే ఉమ్మడి జిల్లావాసుల కష్టాలు తీరుతాయి. మిగతా రహదారుల నిర్మాణం, మరమ్మతులకు ప్రభుత్వం దృష్టిసారించాలి.

చెరువులకు రక్షణ

(3వ పేజీ తరువాయి)

చెరువులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారు. మిగిలిన చెరువులకు సంబంధించి అంచనాలు పూర్తయిన తర్వాత టేకు మొక్కలు నాటే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు.

ఇదీ పరిస్థితి ..

గత కొన్నేళ్లుగా జిల్లాలో చెరువులు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. కబ్జాదారుల చేతుల్లో చిక్కి రూపు కోల్పోతున్నాయి. అక్రమ నిర్మాణాలు పెరిగిపోతుండడంతో రోజురోజుకూ వాటి విస్తీర్ణం తగ్గిపోతోంది. దీంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. పార్వతీపురం మండలం బాలగొడబ పంచాయతీలో అతిపెద్ద లంకెల చెరువు ఆక్రమణలకు గురై ప్రస్తుతం ఆనవాళ్లను కోల్పోయింది. జిల్లాలో అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెళ్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అయితే చెరువుల రక్షణపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. వాటి చుట్టూ బౌండరీలు నిర్ణయించి, టేకు మొక్కలు పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 'కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురికాకుండా వాటి చుట్టూ టేకు మొక్కల పెంపకానికి అంచనాలు రూపొంది స్తున్నాం. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.' అని డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ



లబ్ధిదారులతో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.8.55 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, చనమల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ఆపద్బాంధవులు



రక్తదాన శిబిరంలో పృథ్వీ మోహన్

పార్వతీపురంటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదాతలే ఆపద్బాంధవులని కర్షక మహర్షి ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ ద్వారపురెడ్డి పృథ్వీ మోహన్ అన్నారు. మంగళవారం పృథ్వీ మోహన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆసుపత్రి ఆవరణలో వైద్యుడు జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పృథ్వీ మోహన్ మాట్లాడుతూ యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు రక్తదాన శిబిరాలను నిర్వహించేందుకు ముందుకు రావాలన్నారు. కర్షక మహర్షి ఆసుపత్రి ద్వారా ఎంతో పేదలకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం కర్షక మహర్షి ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహనరావు, ప్రతిమాదేవి దంపతులు.. పృథ్వీ మోహన్‌ను ఆశీర్వదించారు.

ఘనంగా ఘటోత్సవం



ఘటాలు, ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పాలకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగవంశపువీధి జంక్షన్‌లో పురటాల పోలమాంబ ఘటోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. నాగవంశపువీధి, బాయగట్టువీధి, వెంకటరమణకాలనీ, మెయిన్‌రోడ్డు తదితర కాలనీలకు చెందిన భక్తులు పురటాల పోలమాంబకు ముర్రాటలు, ఘటాలు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బళ్లవేషాలు, శక్తివేషాలు, ప్రత్యేక నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పట్టణ పుర వీధులగుండా తిరిగి అమ్మవారికి ముర్రాటలు, ఘటాలు చెల్లించారు. భక్తుల కోలాహలంతో రహదారి కిక్కిరిసింది. బళ్ల వేషాలు చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో హడావుడిగా కనిపించింది.

సందడిగా అపూర్వ సమ్మేళనం



జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు

పాలకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్.వి.జి.జె.కళాశాలలో 1983-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం సందడిగా నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. వేర్వేరు చోట్ల స్థిరపడిన వారంతా చేరుకుని మిత్రులతో ఆనందంగా గడిపారు.

గిరిజనుల శ్రమదానం

కురుపాం రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు మంగళవారం శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసుకున్నారు. ఒబ్బంగి నుంచి తోలుంగూడ వరకూ రెండు కిలో మీటర్ల రోడ్డు యావత్తూ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగాయి. రోడ్డును బాగుచేయాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోకపోవడంతో గిరిజనులు స్పందించారు. ఇంటికి ఒకరు చొప్పున 40 మంది సమష్టిగా రోడ్డుపై గుంతలు పూడ్చారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించారు. తోలుంగూడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మండంగి అడ్డమేశ్వరరావు తదితరులున్నారు.

తోటపల్లికి తగ్గిన వరద ఉధృతి

గరుగుబిల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి 4,500 క్యూసెక్కుల వరద చేరింది. దిగువకు 3,100 క్యూసెక్కులను స్పిల్‌వే గేట్లు నుంచి విడుదల చేశారు.

అడారుగెడ్డకు..

మక్కువ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరు సమీపంలోని అడారుగెడ్డకు వరద ఉధృతి తగ్గలేదు. 20 గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు సూచించారు. మంగళవారం సన్యాసిరాజుపేటలోని హెల్త్ వెల్‌నెస్ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను గుర్తించి సకాలం లో వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఎన్‌సీడీ 4.0 సర్వేను పక్కాగా నిర్వహించి దీర్ఘకాలిక రోగులు, క్యాన్సర్ లక్షణాలను గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు అవసరమైన సేవలందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు డీపీఎంవో డాక్టర్ పీఎల్ రఘుకుమార్, డెమో యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలగవాడలో రచ్చబండ

పాలకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెలగవాడలో మంగళవారం జనసైనికులతో రచ్చబండను నిర్వహించారు. జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు ఆధ్వర్యంలో రచ్చబండ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాలు, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సూచనలు మేరకు జనసైనికులు ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై వివరించారు. కూటమి నాయకులు ఎవరు బరిలో నిలిచినా సమష్టిగా వారి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు.

కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్

కురుపాం, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో వీధి కుక్కలకు మంగళవారం పశువైద్యాధికారి డాక్టర్ శైలజ యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేశారు. కుక్కలను జనా వాసాలకు దూరంగా విడిచిపెట్టారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో కె.సురేష్, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ ఉన్నారు.

సారా, మద్యం ధ్వంసం

కురుపాం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కురుపాం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడిన సారా, మద్యాన్ని మంగళవారం ధ్వంసం చేశారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 43 కేసులలో పట్టుబడిన 1456 లీటర్ల సారా, 47 కేసుల్లో పట్టుబడిన 52 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ జె.రాజశేఖర్ తెలిపారు.

బీటీ రోడ్డు వేయండి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లప్పటి నుంచి వాడబాయి గ్రామానికి వెంటనే బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం లప్పటి-వాడబాయి రోడ్డుపై నిరసన తెలిపారు. గతంలో మట్టి రోడ్డు ఏర్పాటు చేయడంతో వర్షాలకు కొట్టుకుపోయిందన్నారు. దాంతో స్థానికులు ఆసుపత్రి, సంతకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. రోగులను అత్యవసర పరిస్థితుల్లో డోలీల్లో తరలించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ముండంగి సన్యాసిరావు, యువజన సంఘం నాయకులు కిల్లక సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా

సాలూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు పీఎం స్వానిధి, లోక కల్యాణ్ మేళాతో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన పీఎం స్వానిధి, లోక కళ్యాణ్‌మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. చిన్న వ్యాపారులను ఆదుకోవడమే ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్య నారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

సీతానగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టు, టెక్నీషియన్ పాల్గొన్నారు.

మక్కువలో భారీ వర్షం



మజ్జిగౌరమ్మ ఆలయంలో చేరిన వరదనీరు

మక్కువ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్ని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎ.వెంకంపేట సమీపంలో బూరాడగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వెంగళరాయసాగర్ జలాశయంలోకి వరదనీరు చేరడంతో సువర్ణముఖి నదికి భారీ స్థాయిలో వరదనీటిని విడిచిపెట్టారు. స్థానిక మజ్జిగౌరమ్మ కోవెలలోకి కూడా నీరు చేరింది.

వరదనీటి మళ్లింపునకు చర్యలేవి?



గత అర్ధరాత్రి వర్షానికి ప్రధాన రహదారిలో నిలిచిన వరదనీరు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో వరద నీటి మళ్లింపునకు కార్యాచరణ చేపట్టడంలో దశాబ్దాలుగా పాలకులు విఫలమవు తున్నారు. పర్యవసానంగా వర్షాకాలంలో ప్రధాన రహదారిలో వ్యాపారులు, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీఇన్నీకావు. రెండు రోజులుగా రాత్రి కురిసిన భారీ వర్షాలకు మేదర వీధి నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు మోకాళ్ల లోతులో వరదనీరు నిలిచింది. వాహనాల రాకపోకలు నిలిచాయి. ఏటా వర్షాకాలంలో ప్రధాన రహదారిలో వరదనీటి మళ్లింపునకు మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడం మినహా శాశ్వత చర్యలకు ఉపక్రమించడంలేదు. దీంతో పట్టణవాసులకు ఇబ్బందులు తప్పడంలేదు.

విద్యార్థినులకు ముగిసిన శిక్షణ

సీతంపేట రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐలో హడ్డుబంగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన 25 మంది పదోతరగతి విద్యార్థినులకు నిర్వహిస్తున్న కంప్యూటర్ కోర్సు శిక్షణ మంగళవారం ముగిసింది. 10 రోజుల పాటు ఇక్కడ విద్యార్థినులకు హెచ్ఎం ఉమావాణి ఆధ్వర్యంలో జి.శ్రావణి కంప్యూటర్ కోర్సులో శిక్షణ ఇచ్చారు.

